క్లుప్తంగా

నేడు సచివాలయాల్లో ఓటర్ల దినోత్సవం

నాదెండ్ల: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని గురువారం అన్ని సచివాలయాల్లో విధిగా నిర్వహించాలని ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్ తెలిపారు. ఓటు హక్కు విశిష్టత, ప్రజాస్వామ్య విలువల గురించి వివరించటంతో పాటూ ప్రతిజ్ఞ కార్యక్రమం ఉంటుందన్నారు. సచివాలయం పరిధిలోని ఓటర్లు పాల్గొనాలని కోరారు.

మహిళా ఓటర్లే అధికం

నాదెండ్ల: నాదెండ్ల మండల పరిధిలో 52,522 మందితో తుది ఓటర్ల జాబితా విడుదలైనట్లు తహశీల్దార్ నాంపల్లి నాగమల్లేశ్వరరావు తెలిపారు. వీరిలో మహిళలు 26,891 మంది కాగా, పురుషులు 25,604 మంది, ట్రాన్స్‌జెండర్లు 27 మంది ఉన్నట్లు తెలిపారు. పురుషుల కన్నా 1287 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు.

అంగన్‌వాడీలు ప్రారంభం

నాదెండ్ల: రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించటంతో సమ్మె విరమించారు. మంగళ, బుధ వారాల్లో నాదెండ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని యడ్లపాడు, నాదెండ్ల, చిలకలూరిపేట పట్టణం, రూరల్ పరిధిలో 267 అంగన్‌వాడీ సెంటర్లు పూర్తిస్థాయిలో ప్రారంభమయ్యాయని సీడీపీవో శాంతకుమారి తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం, టేక్ హోం రేషన్‌తో, వేడిగా తయారుచేసిన ఆహారాన్ని వడ్డించాలన్నారు.

ఘనంగా డ్రైవర్స్ డే



వినుకొండ(నూజెండ్ల): ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ వినుకొండ డిపోలో డ్రైవర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ బి. కోటేశ్వరరావు నాయక్ డ్రైవర్లకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియ జేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విధినిర్వహణలో ఎంతో జాగ్రత్తగా ఉంటూ ప్రయాణీకుల ప్రాణాలను, కుటుంబాలను కాపాడే పవిత్రమైన వృత్తి డ్రైవర్‌దని, ఆర్టీసీ డ్రైవర్లు శిక్షణ కలిగి అత్యంత సురక్షితంగా విధులు నిర్వహిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో వివిధ యూనియన్‌ల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభచూపిన వేల్పూరు విద్యార్థులు

శావల్యాపురం: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా పల్నాడు జిల్లా స్థాయిలో జెడ్పీ బాయ్స్ పాఠశాల్లో జరిగిన పోటీల్లో మండలంలోని వేల్పూరు గ్రామం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి కె.నాగరోహిణ వ్యాసరచన పోటీలో ఓటే నామొదటి ప్రాధాన్యత అంశంపై ప్రథమ బహుమతి సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మహమ్మద్ సుభాని బుధవారం తెలిపారు. అలాగే వకృత్వ పోటీల్లో జె.వివేకానంద ప్రోత్సాహక బహుమతి సాధించినట్లు చెప్పారు. విజేతలకు డిప్యూటీ డీఈవో వేణుగోపాల్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల పేరెంట్ కమిటీ చైర్మన్ పల్లపాటి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు జ్యోతి శ్రీనివాసరావు కాకుమాను రాజేష్, గురుబాబు తదితరులు విజేతలను అభినందించారు.

కర్పూరి ఠాకూర్ జీవితం బీసీలకు ఆదర్శప్రాయం



నరసరావుపేట: దివంగత బీహార్ మాజీ ముఖ్యమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు కర్పూరి ఠాకూర్‌కి భారతదేశ ప్రభుత్వ అత్యున్నత పురస్కారమైన భారతరత్న ప్రకటించడం చాలా హర్షించదగ్గ విషయమని బీసీ నాయకులు పేర్కొన్నారు. స్థానిక ఎన్‌జీవో హోమ్‌లో బుధవారం ఏపీ బొందిలి సంఘం రాష్ట్ర కార్య నిర్వహక కార్యదర్శి బొందిలి శ్రీనివాస్‌సింగ్, వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులు జి.సాంబశివరావు, గంజి జోగేశ్వరబాబు, బొందిలి సంఘం పట్టణ ఉపాధ్యక్షుడు బొందిలి సీతారామసింగ్ మాట్లాడుతూ కర్పూరీ ఠాకూర్ శతజయంతి ఉత్సవాలు ప్రారంభానికి ఒక రోజు ముందు భారతరత్న ప్రకటించడం చాలా ఆనందంగా ఉందన్నారు. బీహార్‌లోని సమస్తిపూర్ జిల్లాలో కర్పూరి గ్రామంలో ఒక పెద వ్యవసాయ రైతు కుటుంబంలో నాయీ బ్రాహ్మణ కులంలో జన్మించారన్నారు. బీహార్‌కి రెండుసార్లు ముఖ్యమంత్రిగా సేవలు అందజేశారని, వారి ఆధ్వర్యంలో బీసీల కోసం 26 శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. ఆ స్ఫూర్తి మండల్ కమిషన్‌కు ప్రేరణగా నిల్చాయన్నారు.

నీటికుంటల ఏర్పాటుకు నిధులు మంజూరు

శావల్యాపురం: జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా వర్షపు నీటిని నిల్వ ఉంచటానికి సేంద్రియ నీటి కుంటలు ఏర్పాటు చేయటానికి ఉపాధి నిధులు మంజూరు చేసినట్లు ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య బుధవారం తెలిపారు. మండలంలోని కనమర్లపూడి గ్రామంలో సేంద్రీయ నీటికుంట పనులకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సేంద్రియ నీటి కుంటల 47 మంజూరు కాగా ఒక్కొక్కటీ రూ. లక్ష రూపాయలు మంజూరు చేసినట్లు చెప్పారు. ఆయనతో పాటు ఏపీవో రామారావు, ఉపాధి టీఏలు శ్రీనివాస గుప్తా, రాణి తదితరులు పాల్గొన్నారు.

రేపటి భవిష్యత్‌కే ఓటు

- కలెక్టర్ శివశంకర్ లోతేటి
- కొండవీడు కోటలో 14వ జాతీయ ఓటరు దినోత్సవంపై అవగాహన
- ట్రెక్కింగ్ చేసి కొండశిఖరంపై బ్యానర్ ఆవిష్కరణ
- ఓటు విలువను ప్రతి ఒక్కరికీ తెలిపేందుకు వినూత్న కార్యక్రమం



కొండవీడు తారా బురుజు వద్ద అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

యడ్లపాడు: ప్రజాస్వామ్యం మనుగడకు ఓటే అత్యంత కీలకమని..భారత రాజ్యాంగం కల్పించిన ఆ హక్కును ప్రతి ఒక్కరూ తప్పక సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి పిలుపునిచ్చారు. 14వ జాతీయ ఓటరు దినోత్సవ అవగాహన కార్యక్రమాన్ని వినూత్నంగా చేపట్టారు. మండలంలోని చారిత్రక ప్రాశస్త్యం కలిగిన కొండవీడు కోటను సందర్శించారు. కొండపై ఉన్న చిల్డ్రన్ పార్కు వద్ద నుంచి చుక్కల కొండ బురుజు వరకు ట్రెక్కింగ్ చేసి ఓటరు దినోత్సవ బ్యానరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఈ ఏడాది కొత్తగా నథింగ్ లైక్ ఓటింగ్...ఐ ఓట్ ఫర్ ష్యూర్ నినాదంతో ఓటరు దినోత్సవాన్ని నిర్వహిస్తుందన్నారు. కాబట్టి జాతీయ ఓటర్ దినోత్సవంపై అవగాహనతో పాటు యువతకు సందేశం ఇవ్వాలనే ఆలోచనతోనే గిరి దుర్గంలో ట్రెక్కింగ్ నిర్వహించడం జరిగిందన్నారు. జాతీయ ఓటర్ దినోత్సవంపై అవగాహన కల్పించే విధంగా ట్రెక్కింగ్ నిర్వహించడం జరిగిందన్నారు. ప్రజలందరూ అర్హత కలిగిన వారంతా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కొండవీటికోటను ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయుటలో ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి ఎన్ రామచంద్రరావు, కొండవీటి కోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కె.శివారెడ్డి యువతీ, యువకులు తదితరులు పాల్గొన్నారు

గ్రామాల సుస్థిరాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఎంపీపీ పిడతల ఝాన్సీసాగర్
- ప్రశాంతంగా యడ్లపాడు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ ఝాన్సీసాగర్, పక్కన ఈవోపీఆర్డీ వరూధిని

యడ్లపాడు: గ్రామాల సుస్థిరాభివృద్ధే ప్రభుత్వ విధానమని..ఇందుకు అనుగుణంగానే ప్రజా సంక్షేమం, అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎంపీపీ పిడతల ఝాన్సీసాగర్ తెలిపారు. యడ్లపాడు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. ఎంపీపీ అధ్యక్షతన కొనసాగిన సమావేశంలో ఈవోపీఆర్డీ బి.వరూధిని ఎజెండా అంశాలను చదివి వినిపించారు. తొలుత ఎంపీపీ మాట్లాడుతూ నేడు జాతీయ బాలికా దినోత్సవమని, ఆడపిల్లలపై వివక్ష రూపుమాపాలని అది కుటుంబం వ్యవస్థ నుంచే ప్రారంభమయ్యేలా అందరం ప్రతినబూనాలని పిలుపునిచ్చారు. వివిధ శాఖల అధికారులు ఆయాశాఖలకు సంబంధించిన పనులు, వాటి ప్రగతి తదితర అంశాలను వివరించగా, 2024–25 సంవత్సరానికి సంబంధించి బ్లాక్ పంచాయతీ డెవలప్మెంట్ ప్రోగ్రాం (బీపీడీపీ)ను ఆమోదించారు.

ఒకేసారి పదిమందికి కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు

రోబోటిక్ సర్జన్ డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాసరెడ్డి



సమావేశంలో డాక్టర్లు, ఆపరేషన్ చేయించుకున్న పిల్లలు, వారి తల్లిదండ్రులు

నరసరావుపేట: స్థానిక సత్తెనపల్లి రోడ్డులోని డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్‌లో పుట్టుకతో మూగ, చెవుడుకు గురైన పదిమంది పిల్లలకు ఉచితంగా ఒకేసారి కాక్లియార్ ఇంప్లాంట్ సర్జరీలు విజయవంతంగా చేసినట్లు హాస్పిటల్ మేనేజింగ్ డైరక్టర్, ప్రముఖ రోబోటిక్ సర్జన్ డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఇది రెండు తెలుగు రాష్ట్రాల్లో ఒక రికార్డుగా ఆయన పేర్కొన్నారు. హాస్పిటల్ ఆవరణలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఆరోగ్యశ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పది మంది పిల్లలకు సర్జరీ చేసి వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపామన్నారు. ఈ పిల్లలకు సర్జరీలను సర్జన్ డాక్టర్ ఏపూరి రాజేష్ ఒక్కరే చేయడం మన రెండు తెలుగు రాష్ట్రాలకు గర్వకారణమని పేర్కొన్నారు. దీంతో ఆయన తన కెరీర్‌లో 50 సర్జరీలు పూర్తిచేశారన్నారు. డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ 12 గంటలు పట్టే ఒక్కో సర్జరీ ఒక గంటలో పూర్తి చేశామన్నారు. ఒక సర్జరీ నుంచి మొదలుకొని ఈరోజు 50 మంది పిల్లలకు పూర్తిస్థాయిలో ఒక్క కాంప్లికేషన్ కూడా లేకుండా సర్జరీలు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ రికార్డు చేసేందుకు డాక్టర్ శ్రీనివాసరెడ్డి, వైద్య సిబ్బంది కృషి, సహకారం మరువలేనిదన్నారు. సమావేశంలో ఆపరేషన్ చేయించుకున్న పిల్లలు, వారి తల్లిదండ్రులు, డాక్టర్లు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం



మేళ్లవాగు అంగన్‌వాడీ కేంద్రంలో జాతీయ బాలికా దినోత్సవం

వినుకొండ(నూజెండ్ల): జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా నూజెండ్ల మండలం చెరుకుంపాలెం గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర బాలికలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరాజకుమారి పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఆదిలక్ష్మి, వెంకమ్మ, కరిముల్లా పాల్గొన్నారు.

ఆడపిల్లలను గౌరవించాలి

బొల్లాపల్లి: మండలంలోని మేళ్లవాగు సెక్టారు పరిధిలో మేళ్లవాగు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో జాతీయ బాలికా దినోత్సవం బుధవారం నిర్వహించారు. కార్యకర్త ఎస్.సరోజిని, మేళ్లవాగు సెక్టారు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొత్త తరాల సృష్టికర్తలు వారే...

యడ్లపాడు: ఆడపిల్లలు కొత్తతరాల అభ్యున్నతికి సృష్టికర్తలని మండలం ప్రత్యేక అధికారి పి.రాధారాణి చెప్పారు. నాదెండ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో యడ్లపాడు గ్రామంలో బుధవారం జాతీయ బాలిక దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థినులు, ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు గ్రామంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

ఆడబిడ్డలకు మంచి విద్యనందించాలి

నాదెండ్ల: తల్లిదండ్రులు తమ ఆడబిడ్డలను మంచి విద్యావంతులుగా తీర్చిదిద్ది వారి ఉజ్వల భవితకు బాటలు వేయాలని నాదెండ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు ఏసీడీపీవో నిర్మల చెప్పారు. సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రపంచ బాలికల దినోత్సవం నిర్వహించారు. నాదెండ్ల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ప్రత్యేకాధికారి మాధవీ లత అధ్యక్షతన బాలికా దినోత్సవం నిర్వహించారు.

ఘర్షణలతో జీవితాలు నాశనం

- ఎస్‌ఐ జె శామ్యూల్ రాజీవ్ కుమార్
- మైదవోలు గ్రామంలో పోలీసులు పల్లెనిద్ర కార్యక్రమం



మైదవోలులో అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ జె శామ్యూల్ రాజీవ్‌కుమార్

యడ్లపాడు: ప్రజలు గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో పోలీసులకు సహకారం అందించాలని యడ్లపాడు ఎస్ఐ జె.శామ్యూల్ రాజీవ్‌కుమార్ తెలిపారు. పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని మైదవోలు గ్రామాన్ని సందర్శించారు. ముందుగా గ్రామంలోని వీధుల్లో స్థానికులతో కలిసి పర్యటించి సమస్యల్ని తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని కమ్యూనిటీ హాలు వద్ద అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల్ని నేరుగా తెలుసుకునేందుకు జిల్లా ఎస్పీ వై రవి శంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టామన్నారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో పల్లెల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పడమే పల్లెనిద్ర ముఖ్యోద్దేశం అన్నారు. ఘర్షణలు పడి నష్టపోవద్దని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ గౌరీ లక్ష్మయ్య, స్థానిక ప్రజలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ..



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న గిరిబాబు

వినుకొండ(నూజెండ్ల): గ్రామీణ ప్రాంతాల్లో యువతియువకుల ప్రతిభను వెలికితీసి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని వైఎస్సార్ సీపీ యువ నాయకులు బొల్లా గిరిబాబు అన్నారు. స్థానిక లయోలా పాఠశాలలో నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బేతం గాబ్రియేలు, కౌన్సిలర్‌లు షకీలాదస్తగిరి, పాపసాని బ్రహ్మయ్య, ఎంపీపీ జయశ్రీ వెంకటరామిరెడ్డి, జెడ్పీటీసీ విజయలక్ష్మి రాజా, మండల కన్వీనర్ దండు చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర పోటీలతో క్రీడాకారుల క్రీడానైపుణ్యాలు వెలికితీసే అవకాశం ఏర్పడిందని నాదెండ్ల జెడ్పీటీసీ సభ్యుడు కాట్రగడ్డ మస్తాన్‌రావు చెప్పారు. ఆడుదాం ఆంధ్ర పోటీల్లో భాగంగా బుధవారం పట్టణంలోని సీఆర్ క్లబ్ ఇండోర్ స్టేడియంలో షటిల్ పోటీలు నిర్వహించారు.

నెట్‌బాల్, బాల్‌బాడ్మింటన్ పోటీల్లో సత్తాచాటారు!

ఈపూరు: మండలంలోని ముప్పాళ్ల ధనలక్ష్మి వ్యాయామ కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 23 తేదీన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన అంతర్ కళాశాలల నెట్ బాల్, బాల్ బ్యాడ్మింటన్ పురుషుల విభాగాల్లో కళాశాల విద్యార్థులు ప్రథమ స్థానం సాధించినట్లు ధనలక్ష్మి వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చందు వెంకట్రావు బుధవారం తెలిపారు. ప్రథమ స్థానం పొందిన జట్టు నుంచి ఆల్ ఇండియా నెట్ బాల్ జట్టుకు బీపీఈడీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కె.భానుప్రకాష్, కె.ప్రవీణ్, బీపీఈడీ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఎస్.రవితేజ, ఎంపీఈడీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జి.సాల్మన్ రాజులు ఎంపికై నట్లు ఆయన తెలిపారు. బాల్ బ్యాడ్మింటన్ విభాగంలో ఆల్ ఇండియా పోటీలకు బీపీఈడీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కె.దుర్గాప్రసాద్ ఎంపికైనట్లు తెలిపారు. విజయం సాధించి ఆల్ ఇండియా జట్టుకు ఎంపికై న విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మేదరమెట్ల రామశేషగిరిరావు, అధ్యాపకులు ఆర్.బి.నాయక్,ఎం. దాస్, సీహెచ్. అరవింద్, ఎస్‌కే.కె.బాజీ, వంశీ తదితరులు అభినందించారు.

సాతులూరులో 104 వైద్యశిబిరం

నాదెండ్ల: సాతులూరు హెల్త్ సబ్‌సెంటర్‌లో బుధవారం 104 వైద్య వాహనం ద్వారా ఉచిత వైద్యసేవలు అందించారు. 260 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. నాదెండ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి జ్ఞానేశ్వరి, సిబ్బంది నాగ రాధిక, జోజమ్మ, ఎ రవి, పవన్‌కుమార్‌రెడ్డి, సాంబశివరావు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా పోటీలకు కేబీఆర్ విద్యార్థిని

నరసరావుపేట ఈస్ట్: జాతీయస్థాయి ఖేలో ఇండియా అండర్–17 బాలికల రెజ్లింగ్ పోటీలకు కాసు బ్రహ్మానందరెడ్డి జూనియర్ కళాశాల విద్యార్థిని ఎం.నాగరత్నకుమారి ఎంపికై నట్టు కేబీఆర్ విద్యాసంస్థల ప్రిన్సిపల్ సిహెచ్.వి.నాగిరెడ్డి బుధవారం తెలిపారు. ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన అండర్–17 స్కూల్‌గేమ్స్ బాలికల రెజ్లింగ్ పోటీలలో రాష్ట్రస్థాయిలో నాగరత్నకుమారి ప్రతిభ చాటి ఖేలో ఇండియా పోటీలకు ఎంపికైనట్టు వివరించారు. తమిళనాడు రాష్ట్రం చెన్నైలో ఈనెల 24 నుంచి 29వ తేదీ వరకు జరగనున్న ఖేలో ఇండియా జాతీయస్థాయి అండర్–17 బాలికల రెజ్లింగ్ పోటీలలో నాగరత్నకుమారి ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికై న విద్యార్థినిని కళాశాల కార్యదర్శి, గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఏ.వెంకటశివ, పిడి ఎం.విసీల్, అధ్యాపకులు అభినందించారు.

నెట్‌బాల్ పోటీలకు ఇరువురి ఎంపిక



భానుప్రియ, రంగశెట్టి దీప్తి

చిలకలూరిపేటటౌన్: జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు తమ పాఠశాల విద్యార్థినులు ఎంపికవ్వడం అభినందనీయమని బొప్పూడి జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం బి.వెంకటేశ్వర్లు చెప్పారు. బుధవారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన విద్యార్థినులు దగ్గుమల్లి భానుప్రియ, రంగశెట్టి దీప్తి లు ఇటీవల ఒంగోలులో నిర్వహించిన రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో విశేష ప్రతిభ కనపరిచి జాతీయ స్థాయి జూనియర్ నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. వీరు ఈ నెల 25 నుంచి 29 వరకు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ జరగనున్న జాతీయ స్థాయి జూనియర్ నెట్‌బాల్ పోటీలలో పాల్గొంటారని చెప్పారు. విద్యార్థినులను అభినందించిన వారిలో గ్రామ సర్పంచ్ అప్పాపురం షేక్ రమేష్, పీడీ నాగమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధితో పేదలకు భరోసా



చిలకలూరిపేట: ముఖ్యమంత్రి సహాయనిధి పేదల జీవితాలకు భరోసా కల్పిస్తూ, వారికి మెరుగైన వైద్యం అందేందుకు ఎంతగానో దోహదపడుతున్నదని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు చెప్పారు. పట్టణంలోని సుగాలి కాలనీకి చెందిన రమావత్ రామ్‌సింగ్ నాయక్ అనారోగ్యానికి గురై ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఆయనకు పట్టణంలోని బ్యాంకు కాలనీలో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రూ.40 వేలు సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బుధవారం మల్లెల రాజేష్‌నాయుడు అందజేశారు. ఎంతోమంది నిరుపేదలు అధునాతన వైద్యం చేయించుకుని సీఎంఆర్‌ఎఫ్ ద్వారా చేయూత అందుకుంటున్నారని వెల్లడించారు. పేదలకు సీఎం రిలీఫ్‌ఫండ్ గొప్ప వరమని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొలిశెట్టి శ్రీనివాసరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, రాష్ట్ర ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ దరియావలి, 34,35 వార్డు కౌన్సిలర్లు వడితే కోట్యానాయక్, రమణీబాయి పాల్గొన్నారు.

ముగిసిన మున్సిపల్ బడ్జెట్ సమావేశం

వినుకంద(నూజెండ్ల): తాగునీరు, డ్రెయినేజీ, సీసీరోడ్లు, నిర్మాణాలకు ప్రాధాన్యతనిస్తూ పట్టణ ప్రజలకు మెరుగైన వసతి సౌకర్యాలు అందించేందకే ప్రాధాన్యతనిస్తూ బడ్జెట్ రూపొందించినట్లు మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ దస్తగిరి అన్నారు. స్థానిక పురపాలక సమావేశ హాల్‌లో ప్రత్యేక సమావేశం బుధవారం నిర్వహించారు. మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ దస్తగిరి ఆధ్వర్యంలో 2023–24 సంవత్సరం బడ్జెట్ సవరణ, 2024–25 బడ్జెట్‌ను కౌన్సిల్ సమావేశం ఆమోదించింది.2023–24లో సవరించిన బడ్జెట్ ప్రకారం ముగింపు నిల్వ రూ.1054.39 లక్షలు, 2024–25 సంవత్సరానికి నిల్వ 1064.67 లక్షలు అంచనాలను ఆమోదించారు. కౌన్సిల్ సభ్యులు బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బేతం గాబ్రియేలు, తెల్లాకుల రాజేష్‌ఖన్నా, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

రూ.3.5 కోట్లతో ఎస్‌ఆర్‌కేటీ కాలనీ అభివృద్ధి

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి
- కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం



కాలనీ వాసికి పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, నాయకులు

నరసరావుపేట: జగనన్న ప్రభుత్వంలో పట్టణ శివారు చిలకలూరిపేట రోడ్డులోని ఎస్ఆర్‌కేటీ కాలనీని రూ.3.5 కోట్లతో అభివృద్ధి చేశామని, అందులో రూ.1.5 కోట్ల వ్యయంతో తాగునీటి సదుపాయం కల్పించామని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ఎస్ఆర్‌కేటీ కాలనీలో అధికారులు, నాయకులతో కలిసి గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తాగునీటి కుళాయిలను ప్రారంభించారు. గడప గడపకు తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏవిధంగా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. మళ్లీ పథకాలు నిరంతరంగా అందాలంటే వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలని వారికి సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ ఓలేటి శ్రీనివాసరావు, కేసానుపల్లి గ్రామ నాయకుడు మారూరి శివారెడ్డి, స్వచ్ఛాంధ్ర, మాదిగ, గిరిజన కార్పొరేషన్ డైరక్టర్లు ఎస్.సుజాతాపాల్, కందుల ఎజ్రా, పాలపర్తి వెంకటేశ్వరరావు, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి షేక్ ఖాదర్‌బాషా, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు నూరుల్ అక్తాబ్, ఎస్సీ సెల్ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యుడు మల్లెల అశోక్, వెంకటేశ్వరరెడ్డి, హాలీవుడ్ రఘు, కాలనీ నాయకులు పాల్గొన్నారు.

పది రూపాయల కాయిన్లు ఉపయోగించాలి

కాయిన్లపై ప్రచురించిన కరపత్రాలు ఆవిష్కరించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి, చాంబర్ ప్రతినిధులు

నరసరావుపేట: రిజర్వు బ్యాంకు ముద్రించిన పది రూపాయల కాయిన్లు చెల్లుతాయని, కనుక వ్యాపారస్తులతో పాటు వినియోగదారులు అందరూ తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. చిరిగిన నోట్లు, పది రూపాయల కాయిన్లపై అవగాహన నిమిత్తం బుధవారం చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ప్రతినిధులు ముద్రించిన కరపత్రాలను ఎమ్మెల్యే గోపిరెడ్డి తన కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వమే కాయిన్లను ముద్రించినందున చెల్లుబాటు అవుతాయి కనుక వ్యాపారస్తుల నుంచి వినియోగదారులు, వినియోగదారుల నుంచి వ్యాపారులు ఇచ్చిపుచ్చుకోవాలన్నారు. కాయిన్లు ఎవరు తీసుకోకపోయినా అది నేరంగా పరిగణించబడుతుందని హెచ్చరించారు. చిరిగిన నోట్లు కూడా ఇవ్వటం, తీసుకోవటం చేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు కొత్తూరి కిషోర్‌బాబు, గాదంశెట్టి రామకృష్ణ, కోశాధికారి పచ్చిపులుసు జగన్నాధరావు, వ్యాపారులు పాల్గొన్నారు.

రోగులకు సంజీవని 'స్మార్ట్ ఐసీయూ'

- శ్రీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి



ఐసీయూలో కోలుకున్న రోగిని పరామర్శిస్తున్న డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, వైద్యులు

చిలకలూరిపేట: సంక్లిష్ట ఆరోగ్య పరిస్థితుల్లో ఉన్న రోగులకు ప్రభుత్వాసుపత్రిలో లైవ్ అనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఏర్పాటు చేసిన స్మార్ట్ ఐసీయూ సంజీవని వంటిదని గుంటూరులోని శ్రీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి చెప్పారు. పట్టణంలోని 100 పడకల ఏరియా ప్రభుత్వ వైద్య శాలలో శ్రీ హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహిస్తున్న లైవ్ స్మార్ట్ ఐసీయూ ద్వారా అందుతున్న వైద్య సేవలపై బుధవారం ఆసుపత్రిలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖా మంత్రి విడదల రజిని సహకారంతో శ్రీ హాస్పిటల్ సౌజన్యంతో పైలట్ ప్రాజెక్టుగా చిలకలూరిపేట ఏరియా ఆసుపత్రిలో లైవ్ స్మార్ట్ ఐసీయూ ప్రారంభించటం జరిగిందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీకుమారి, డాక్టర్ ప్రశాంతి, ఆర్ఎంవో డాక్టర్ అమృతవల్లి, లైవ్ సీఈవో మద్దినేని రవి పాల్గొన్నారు.